# మూడు విరోధాలు

"ఇందాక నీ కోసం వచ్చిందే—నీ ఫ్రెండు సావిత్రి! అబ్బా! ఆ అమ్మాయికి పెళ్ళెలా అవుతుందే చిట్టితల్లీ! ఏనుగుదంతాల్లా ముందుకువచ్చిన పళ్ళూ! నీళ్ళ చెంబు ముఖమూ, పిలకజడా! ఆహా! ఆ పిల్ల సోయగాన్ని వర్ణించటం నా తరమా?" అన్నాను ఈజీచైరులోనుండి ముందుకు వొంగి. ఈ మాటలు ఎప్పట్నుంచి చెబుదామా అని కాచుకుని కూర్చున్నాను.

షెల్ఫులో ఏదో పుస్తకాన్ని వెదుకుతూన్నదల్లా రాధ ఉలికిపడి ఇటువైపు చూసింది. గుమ్మంవైపు చూపులు త్రిప్పింది. మళ్ళీ నావంక బెదురుతూన్న కళ్ళతో చూసింది.

"పరంధామయ్యగారమ్మాయి సావిత్రిని గురించేనా నువ్వు చెపుతూంట. అవును అంతే అయివుంటుంది—ఏం?" అంది అర్థిస్తూన్నట్లుగా నావంక చూస్తూ.

నేను గొప్ప ఉత్సాహంలో వున్నాను. ఆ అమ్మాయిని వర్ణించటం నాకు మహదానందం కలిగిస్తోంది. "ఛా! పరంధామయ్యగారమ్మాయి కేం? నిక్షేపంలా వుంటుంది. నేను చెప్పేది-ఇంతకుముందు వచ్చింది కాదూ గళ్ళచీర కట్టుకున్నది. ఆ సావిత్రీదేవి గురించి... అహాహా... ఏమా దంతసోయగం...! కేశసంపద... ఆ నీళ్ళచెంబునుపోలిన వదనారవిందము వున్నదే..."

రాధ ముఖంలో నెత్తురుచుక్క లేదు. కళ్ళతో ఏవో సంజ్ఞలు చేస్తోంది. గుమ్మంవైపు నిస్సహాయంగా చూసింది. అలా రెండు క్షణాలు గడిచాక 'సావిత్రీ!' అంటూ ఆదరా బాదరా బయటికి పరిగెత్తింది.

ఈసారి ముఖంలో నెత్తురుచుక్క లేకపోవటం నా వంతయింది. సిగ్గుతో శరీరం కృంగిపోయింది. రాధ తిరిగి లోపలకు వచ్చేలోగా లేచి ఎటయినా పారిపోదా మనుకున్నాను.

రెండు నిముషాలు గడిచాక రాధ దూకుడుగా లోపలకు వచ్చింది. కోపంతో దాని ముఖం ఎర్రబడివుంది. "వెధవపని చేశావు అప్పటికీ కప్పిపుచ్చుదామని హింట్ యిచ్చినా అర్థం చేసుకోవాయె. ఇప్పుడేం చేస్తావో చెయ్యి. కోపంవచ్చి పిలుస్తున్నా పలకకుండా వెళ్ళిపోయింది" అంది నా వంక చురచురా చూస్తూ.

"ఆమె వెళ్ళిపోయిం దనుకున్నాను రాధా! గుమ్మం

అవతలనిలబడి వుందని తెలిసివుంటే అలా మాట్లాడతానా చెప్పు?" అన్నాను పశ్చాత్తాపంతో కుమిలిపోతూ.

"అయినా ఆ నోటికి అంత తొందరేం? కాస్త ముందూ వెనుకా చూసుకోవద్దూ?" అని నన్ను దుయ్యపడుతోంది పలకరించకుండా.

"ఇప్పుడేం చేదామంటావ్? పోనీ వాళ్ళ యిల్లు ఎక్కడో చెప్పు, వెళ్ళి ఎపాలజీస్ చెప్పుకుంటాను" అన్నాను కాసేపాగి ఆలోచిస్తూ.

"ఉద్ధరించావులే. చేసిందేమో పాడుపని. పైగా ఎపాలజీ చెప్పుకుంటాడుట. అయినా ఆ అమ్మాయి మొహంనీళ్ళ చెంబులా వుంటే నీకేం? తప్పేలాలా వుంటే నీకేం? ఈసారి నీ ఫ్రెండు రామ్మూర్తిని మన ఇంటికి రానియ్యి. ఆ కోతి మొహంగాడ్ని చిత్రవధ చేసేలాగా ఎలా తూర్పారపడతానో చూద్దువుగాని" అని గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది.

నేను జరిగిందానికి చింతిస్తూ వెనక్కి జారగిలబడ్డాను.

మరువాడు సాయంత్రం కాలేజీనుంచి వస్తూ అదే దూకుడుతో గదిలోకి ప్రవేశించింది రాధ — "చూడు, నీ మూలంగా ఓ మంచి ఫ్రెండ్‌ని పోగొట్టుకున్నాను" అంటూ!

"ఏం జరిగింది?" అన్నాను కుతూహలాన్ని కనబరుస్తూ.

"ఇంకా ఏం జరగాలి? సావిత్రి నావంక ముఖంత్రిప్పి చూడటంకూడా మానేసింది. ఎంతో బ్రతిమలాడాను.

ఇందులో నా తప్పేం లేదని నచ్చజెప్పటానికి ప్రయత్నించాను. వినిపించుకుంటేగా సావిత్రి బలే చదువుతుంది తెలుసా? ఇంకా కంబైన్డ్ స్టడీస్‌కి పిలుద్దామనుకున్నాను. అనవసరంగా విరోధం వచ్చిపడింది" అంది విచారంగా.

నేను కూడా బాధపడుతూ "తప్పే అయిపోయింది రాధా! నేను కాస్త నిగ్రహించుకుని వుండాల్సింది. చేయని తప్పుకు ఒక్కోసారి విరోధంలానే వస్తూంటాయి. ఇలా వచ్చి కూర్చో ఇలాంటివే రెండు ఉపమానాలు చెబుతాను," అన్నాను

"ఏమిటి బాబూ! ఇప్పుడు కొంపతీసి కథలు చెప్పటం మొదలు పెడతావేమిటి? ఈ రచయితలతో ఇదే వచ్చింది ఒక్క" అంటూనే కోపం తగ్గించుకుని నాకు దగ్గరగా ఓ కుర్చీని లాక్కుని కుదురుగా కూర్చుంది.

"ఏడిశావులే! కథా కాదు, ఏమీ కాదు. రెండు చిన్న స్వంత అనుభవా లన్నమాట. నీకు అన్నంరాజు గుర్తున్నాడు కదూ?"

"యస్. రైస్‌కింగ్. కౌబాయ్‌లా వుండే కుర్రాడు."

"కుర్రాడు కాదులే. వయసులో నీకంటే పెద్దవాడే. రైస్‌కింగ్ అని ఏడిపించేవాళ్ళం చిన్నప్పుడు. పేరుకూడా అన్నంరాజు అనకూడదు, అన్నమరాజు అనాలి... స్కూల్ ఫైనల్‌లో మేమిద్దరం చెప్పలేనంత క్లోజ్‌గా వుండేవాళ్ళం. స్కూల్ వొదిలి వెళ్ళిన అరగంటలోనే బట్టలు మార్చుకుని తయారయి ఎక్కడో అక్కడ కలుసుకునేవాళ్ళం పిడతక్రింది

పకోడీ, మిరపకాయ బజ్జీలో, మొక్కజొన్న కండెలో తింటూ యిహా ఎడతెరిపి లేకుండా కబుర్లు చెప్పుకునేవాళ్ళం "

"ఏం కబుర్లు చెప్పుకునే వారేం? మీ క్లాస్ ఆడపిల్లల గురించా?"

"-కూడా చెప్పుకొని వుండొచ్చు, అన్నీ చెప్పుకుని వుండేవాళ్ళం. అన్నమరాజుది గోదావరి జిల్లాలో ఏదో గ్రామం. చదువుకోసం బెజవాడ వచ్చి మేనమామగారింట్లో వుండేవాడు. ఎక్కువ భాగం వాళ్ళింట్లో తినుబండారాల గురించి చెప్పేవాడు. ఉత్తర హిందూస్థానం నుంచీ వాడె వడో వంటవాడొచ్చి వాళ్ళయింట్లో చేరాట్ట రోజు కో కొత్తరకం స్వీటు చేసిపెడుతున్నాడుట. ఇవ్వాళ గుమ్మడి కాయ హల్వా చేశాడనేవాడు. ఇంకోరోజు సందేష్ చేశా డనేవాడు. ఇలా ఏవో చెబుతూండేవాడు.

"అప్పట్లో అప్పగారు తరుచూ మద్రాస్ పోయి వస్తూండేవారు పన్లమీద. అలా వెళ్ళివచ్చినప్పుడల్లా మనంద రికీ మిఠాయిలో, బట్టలో, అవసరానికి పనికివచ్చే వస్తువులో తీసుకొస్తూండేవారు. నే నవన్నీ వాడికి చూపించి మా అప్ప గారు తెచ్చారని గర్వంగా చెప్పేవాడ్ని. వాడి నాన్నగార్ని నే నెప్పుడూ చూడలేదు. వాడు సెలవులకి అప్పుడప్పుడూ యింటికిపోవటం తప్ప వాళ్ళనాన్నగా రెప్పుడూ యిక్కడికి వచ్చినట్లు నేను చూడలేదు అందుకని 'మీ నాన్నగా రెప్పుడూ యిక్కడికి రారేం? ఆయన ఎలా వుంటారు?' అని ప్రశ్నిస్తూ వుండేవాడ్ని.

" 'మా నాన్నగారు చాలా మంచివారు' అనేవాడు అన్నమరాజు ఉత్సాహంగా. 'ఆయన చాలా అందంగా ఉంటారు... అక్కడ బోలెడు పన్లువుంటాయి. అందుకని యిటువైపు ఎన్నడూరారు' అనేవాడు.

"ఒకసారి మంచి గాబర్డన్ ప్యాంటు చూపించాడు. మా నాన్నగారు పంపించారని చెప్పాడు. ఇంకోసారి క్రికెట్ బ్యాట్ పట్టుకొచ్చాడు. మా నాన్నగారు పంపించారని చెప్పాడు. మరోసారి ఫ్యామేస్టర్ తీసుకొచ్చాడు. మా నాన్నగారు పట్టుకువచ్చారని చెప్పాడు. వాళ్ళ నాన్నగారు మా అప్పగారికంటేకూడా మంచి మనిషిలా వున్నాడే అనిపించింది. వాళ్ళ నాన్నగార్ని చూడాలన్న కుతూహలం నా మనసులో పెరిగిపోయింది.

"అన్నమరాజు తరుచూ మనయింటికి వస్తూండేవాడు. మన యింట్లో అందరితో చనువుగా మసిలేవాడు. మన అమ్మా వాళ్ళుకూడా అతని కుటుంబవిషయాలు ఏవో అడుగుతూవుండేవారు. అతను తన తండ్రిని గురించీ వాళ్ళ ఊరినిగురించీ గర్వంగా సమాధానాలు చెబుతూవుండేవాడు.

"వేసవి సెలవులకి యింటికి వెళ్ళిపోయేముందు నా దగ్గరకు వచ్చి 'సెలవుల్లో నా ఉపనయనం జరుగుతుంది' అన్నాడు.

" 'అల్లైతే నేనూ వస్తాను. ఇక్కడ ఊరికినే యింట్లో కూర్చుని నేను చేసేపనేముంది?" అన్నాను వుత్సాహంగా.

"వాడిముఖం ఒక్కసారిగా కళాహీనమైపోయింది. 'నువ్వు వస్తానంటావా?' అని గొణిగాడు

" 'ఏం? ఎందు కలా తెల్లబోయావు?'

" 'ఏంలేదు.. కాని ఈసారి మా వూరు రావద్దులే. ఇంకో సందర్భంలో చూసుకోవచ్చు?'

"వాడలా ఎందు కంటున్నాడో నాకర్థంకాలేదు. ఎప్పట్నుంచో మీ వూరికి వద్దామనుకుంటున్నాను. ఈసారి తప్పకుండా వస్తాను' అన్నాను పట్టుదలగా.

" 'వీల్లేదు' అన్నాడు రాజు గట్టిగా.

" 'ఏం?' అని అడిగాను ఉలికిపడి.

" 'కారణం అనవసరం. నువ్వు రావటం నా కిష్టం లేదు! అంతే' అన్నాడు మొండిగా.

"నాకు కోపంవచ్చి 'నీకు ఫ్రెండ్‌ని ఎలా గౌరవించాలో తెలీదు. మర్యాదలేనివాడివి. మూర్ఖుడివి' అని తిట్టాను. వాడు జవాబు చెప్పకుండా అక్కడ్నుంచి విసవిసా నడిచి వెళ్ళిపోయాడు.

"ఆ మరునాడు నేను పశ్చాత్తాప పడి వాళ్ళయింటికి వెళ్ళి పిలిచాను. వాడు బయటకు వచ్చాడుగాని నన్ను చూసి ముఖం చిట్లించాడు. వాడిని మాట్లాడిద్దామని ఎంతో ప్రయత్నించి విఫలుడనయ్యాను. మొండిరాయిలా నిలబడ్డాడు. ఇహ నేను విసిగి గుడ్ బై చెప్పి అక్కడ్నుంచి వచ్చేశాను.

"అంతే. ఆ విరోధం నాలుగేళ్ళు ఉధృతంగా

పాగింది. ఇంటర్మీడియట్‌లో ఇద్దరం క్లాసుమేట్సుము; బి కాం. లో క్లాసుమేట్సుము. ఒక్కసారికూడా ఒకరినొకరు పలకరించుకోనే లేదు. ఒకరి ముఖంలోకి ఒకరు కన్నెత్తి కూడా చూసుకోలేదు.

"బి. కాం. పాసయిన కొత్తలో నా కేదో కథల పోటీలో బహుమానం వచ్చినందుకు మిత్రులు కొంతమంది చిన్న సన్మానం; పార్టీ యేర్పాటుచేశారు మనవాడు దానికి హాజరవటం నన్నెంతో ఆశ్చర్యపరిచింది. వట్టిగా రావటమే కాదు; పార్కరు పెన్ను ఒకటి బహూకరించాడు బహూకరిస్తూ 'మామూలు మనిషిగా విడిపోయి కథకుడిగా కలుసుకుంటున్నందుకు ఎంతో ఆనందిస్తున్నాను పైకి వచ్చినందుకు నిన్నభినందిస్తున్నాను' అన్నాడు మెరిసే కళ్ళతో. ఇన్నాళ్లకు నా ప్రాణస్నేహితుణ్ణి కలుసుకున్నందుకు నేను సంతోషం పట్టలేకపోయాను. గట్టిగా కౌగలించుకున్నాను.

"అంతే! మళ్ళీ యిద్దరం స్నేహితులైపోయాం. భుజాలమీద చేతులేసుకుని తిరిగేశాం... ఒకరోజు సమయం చూసుకుని – 'నాతో ఆనాడు మాట్లాడటం ఎందుకు మానేశా' వన్నాను.

"వాడిచ్చిన సమాధానం యెంత అమాయకంగా వుందో చూడు! నేనేమో అప్పగార్ని గురించి అన్నీ చెప్పుకు పోతూంటే తనకి కూడా తన తండ్రిని గురించి గొప్పలు చెప్పుకోవాలని వుండేదిట. తన కేమో తండ్రి చిన్నప్పుడే గతించాడు. ఆ విషయం ఎవరికీ తెలియటం అతనికి యిష్టం

వుండేదికాదుట! కారణం తనకే తెలీదు. చిన్నతనమవుతుం దేమోనని భయం. అందుకని ఇంటినుంచి వచ్చిన డబ్బుతో ఏదో వస్తువులుకొని, అవి తండ్రి పంపించాడని బొంకుతూ వుండేవాడు. అలా చెబుతూంటే వాడికేదో ఆనందమనిపిం చేదట. ఈ రహస్యం చాలా రోజులు కాపాడుకుంటూ వచ్చాడు. నేను వాళ్ళ ఊరికి వస్తానని పట్టుబట్టేసరికి, రహ స్యం బట్టబయలౌతుందని కోరి విరోధం తెచ్చుకున్నాడు."

"హాట్టె! వెర్రిబాగులాడిలా వున్నాడు" అని రిమార్కు-ప్యాస్ చేసింది రాధ.

"నువ్వేంతప్పు చేశావని నీతో విరోధం?"

"నువ్వేం తప్పు చేశావని సావిత్రి నీతో విరోధం తెచ్చుకుంది?"

"ఆపొజిషన్‌లో నేను వున్నా మాట్లాడట మానేద్దు నేమో" అంది సాలోచనగా రాధ.

"అనే నేనూ అనుకుంటున్నాను. రాజు స్థితిలో నేను వుంటే ఆపనే చేద్దునేమో!"

"రెండో ఉపమాన మన్నావే అదేమిటి?"

"అదే చెబుతున్నాను. నేను సాగరులో ఎమ్. కాం. ఎల్. ఎల్. బి. చదువుతున్న రోజులు. మా రూమ్‌మేటు శుక్లా అనే అతను నాగపూరు ప్రాంతం మనిషి. ఇద్దరం చాలా సన్నిహితులమై పోయాము. క్రమంగా మా యిద్దరి మధ్యా దాపరిక మన్నది లేకుండాపోయింది. అతని కుటుంబ విషయాలు, వాళ్ళ గృహ పరిస్థితులు నాకు చెబుతూ వచ్చాడు.

"కాని సాధారణం ఎవరి కుటుంబ రహస్యాలను వాళ్ళు బయటపెట్టుకోవటం ఎవరికీ ఇష్టం వుండదు. అందు కని అందులోని మంచి భాగాలనూ, ఇతరులకు రుచించేవి మాత్రం బయటికి చెప్పి చెప్పకూడనివి, అవమానకరమైనవి దాచిపెడుతూ వుంటారు.

"ఉన్నట్లుండి శుక్లా దిగులుగా వుండటం మొదలు పెట్టాడు. మనసులో ఏదో బాధ ననుభవించసాగాడు. చాలాసార్లు కారణం ఏమిటని గుచ్చి గుచ్చి అడిగాను. ఏమీ లేదనీ తప్పించుకునేవాడు.

"అంతకు పూర్వం లేనిది యింటికి రోజుకో ఉత్తరం రాయటం సాగించాడు. ఇంటిదగ్గర్నుంచి ఉత్తరాలు తెగ వస్తున్నాయి మొత్తంమీద ఏదో గృహ కల్లోలాలు జరుగు తున్నాయని గ్రహించి మౌనంగా వూరుకున్నాను.

"ఒకరోజు వంట్లో బాగులేదని చెప్పి శుక్లా కాలేజీకి రాలేదు. సాయంత్రం నేను గదికి చేరేసరికి ఎవరో కొత్త వ్యక్తి కనిపించాడు. యాభయి ఏళ్లుంటాయి. మనిషి పచ్చగా, భారీగా, బలంగా వున్నాడు. ఇద్దరూ పెద్దపెట్టున హిందీలో ఘర్షణ పడుతున్నారు.

"'నేను చెప్పినట్లు విని నోరుమూసుకుని నా వెంట వచ్చివేయటం ఉత్తమం. ఇన్నాళ్ళూ కష్టపడి పెంచి, నిన్ను చదివిస్తూన్నందుకు నన్నే ఎదిరిస్తావా?' అంటున్నా డా పెద్దమనిషి.

"'మీరు నా ప్రాణం తీసినా సరే - నేనా సంబంధం చేసుకోను నా కిష్టంలేదు' అంటున్నాడు శుక్లా.

"'మ రెవరంటే యిష్టం? ఆ మీరా నిత్యానంద్ అంటే యిష్టమా?'

"అవును, ముమ్మాటికీ యిష్టం. సమాధానం లభించిందా?"

"'వాళ్ళ తల్లికి చెడ్డపేరుంది. ఒక అక్క లేచి పోయింది. తండ్రి తాగుబోతు. ఈ సంబంధం నేను ససేమిరా ఒప్పుకోను. ఇదిగో వింటున్నావా? నీ బాగుకోరి చెబుతున్నాను. కుర్రతనం చేష్టాలెయ్యకు!'

"'నే నేం కుర్రతనం చేష్టా లెయ్యటంలేదు. వాళ్ళ కుటుంబం బాగోగులతో నాకు నిమిత్తం లేదు. నేను ఘడియకో రకంగా ఆలోచించేవాడ్ని కాదు నా మనసు మీరు మార్చలేరు.'

"ఇట్లా వాదోప వాదోలు పెరిగి యించు మించు తండ్రీ కొడుకులు మల్లయుద్ధం చేస్తారా అన్నంతవరకూ వచ్చింది పరిస్థితి. ఇద్దరి కళ్ళూ ఎర్రబడ్డాయి. ఇద్దరిముఖాలూ కందగడ్డ లయాయి ఇద్దరి శరీరాలూ వొణుకుతున్నాయి.

"చివరికి 'సరే, ఇంతవరకూ వచ్చిందా నీ వ్యవహారం? ఆస్తి నా స్వార్జితం అని తెలుసుగా. మూడురోజుల్లో మనసు మార్చుకుని యింటికి రాకపోతే ఇహ నీకూ నాకూ తెగ తెంపు లయినట్లే' అని ఆయన ఖరాఖండీగా చెప్పేసి ఇహ ఆగకుండా వెళ్ళిపోయాడు.

“శుక్లా కోపంతో వణికిపోతున్నాడు. నిప్పులు గక్కు-తున్నాడు. కళ్ళవెంబడి నీళ్ళు తిరుగుతున్నాయి 'మధూ పద! నీతో యివాళ చాలా విషయాలు చెప్పాలి' అన్నాడు నా వంక తిరిగి. గది తాళం వేసి యిద్దరం బయల్దేరాం.

తన ప్రేమ గురించీ, ఆ పిల్లని గురించీ అతను చెప్పింది సరే, కాని అతను కోపంతో వళ్ళు మరిచిపోయిన స్థితిలో వున్నాడు. తండ్రినీ, సవతితల్లినీ, ఒక బూతులు తిట్టాడు చూసుకో – ఆ మాటలు వినటానికీ, చెప్పటానికీ సాధ్యంకానివి. తన తండ్రి శీలాన్ని గురించీ, అతనికున్న దుర్వ్యసనాల గురించీ తెగ వర్ణించాడు 'మహా తను బుద్ధిమంతుడు అయినట్లు, ఆ మీరా తండ్రిని దెప్పుతున్నాడు' అంటూ శుక్లా రొప్పుతున్నాడు. 'వాళ్ళ అక్క లేచిపోతే తనకేమిటో! మన దేమయినా అరిగిందా? ఆమాట కొస్తే యీయన కూతురు చేసిన పనేమిటి? పెళ్ళికాకుండా కడుపు తెచ్చుకుంటే ఎబార్షన్ చేయించి...'

“ఇట్లా ఆవేశంలో చెప్పదగినవీ, చెప్పకూడనివీ వాళ్ళ కుటుంబాన్ని గురించి సమస్తం నాకు వర్ణించేశాడు. వింటున్నవాణ్ని నేనే సిగ్గుతో చచ్చిపోయాను. ఆపుదామని ఎంత ప్రయత్నించినా సాధ్యంకానిదే! తెగ చెప్పాడు, తెగ తిట్టాడు.

“అలా చేశాడా! ఆ మరునాడు ఉదయం లేస్తూనే నన్ను శత్రువుని చూసినట్లు చూశాడు పలకరిస్తేపలకలేదు. ముఖం చాటేసుకుని తిరిగాడు నన్ను ఎంతవరకూ ఎవా

యిడ్ చెయ్యాలో అంతా ఎవాయిడ్ చేశాడు. చివరికి నాతో చెప్పా పెట్టకుండా ఆ గది విడిచి వెళ్ళిపోయాడు.

“అంతే! అతని ప్రేమ వ్యవహారం ఏమయిందో తెలీదుగాని అక్కడ వున్న మిగతా రెండు సంవత్సరాలూ మేము ఒకళ్ళతో ఒకళ్ళం మాట్లాడుకోలేదు. పైగా నన్ను శత్రువుని చూసినట్లు చూసేవాడు. అతని కుటుంబ రహస్యాలన్నీ నే నేదో అల్లించి బెల్లించి లాగేసి అపరాధం చేసినట్లు క్రూరంగాచూసేవాడు. చదువు అయిపోయాక మళ్ళీకలుసుకోలేదు. ఏమయినాడో, ఎక్కడున్నాడో కూడా తెలీదు” అని ముగించాను.

“వండర్ ఫుల్ ఫెలో” అంది రాధ.

“కావున ఓ కాలేజీ గర్లుగారూ. విరోధాలనేవి యిన్ని రకాలుగా వస్తూంటాయి. దీన్నిగురించి మనం విచారించ కూడదు” అన్నాను చివర్న నీతిబోధిస్తోన్నట్లు.